

ఎన్నారై ముచ్చట్లు

–సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

23. శాస్త్ర విజ్ఞానం ఎంత శాస్త్రీయం?

సైన్స్ అంటే నాకు ప్రాణం. దానికి మొట్టమొదటి కారణం హైస్కూలునించీ మూడు కాలేజీ డిగ్రీలదాకా నాకు చదువు చెప్పిన గురువులు. ఎందరో మహానుభావులు. తర్వాత నేను చదివిన ఎన్నో పుస్తకాలు. స్కూలు పుస్తకాలే కాదు, బయట లైబ్రరీలలో చదివిన, కొనుక్కుని చదువుతున్న కొన్ని వందల పుస్తకాలు. మూడవది నా ఎనభై వసంతాల పైన జీవితం నేర్పిన ఎన్నో పాఠాలు. వాటిలో ఒకటి పునాది వేళ్ళు అయితే, రెండవది శాస్త్ర విజ్ఞాన వృక్షం. మూడవది ఆ వృక్షానికి కాస్తున్న పువ్వులూ, కాయలూ, పళ్ళూ.

నేను కాలేజీలో ప్రీయూనివర్సిటీ, బీఎస్సీల్లో లెఖ్ఖలు, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలో డిగ్రీ తీసుకుని, ఇంజనీరింగులో బీఈ, ఎంఈ. చదివాను. ఇంజనీరింగ్ అంటేనే అప్లికేషన్ ఆఫ్ సైన్స్ కదా. అందుకే నేను సైన్సునీ, సైన్సు నన్నూ వదిలిపెట్టలేదు. నేను అంటే నేనే కాదు. నాలాటి మీరందరూ కూడాను.

అయినా కొంతమంది, ముఖ్యంగా ఈ రోజుల్లో, ఎంతోమంది సైన్స్ గురించి ప్రతికూలంగా చెప్పే మాటలు వింటుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ వ్యాసంలో ఆధారాలతో వ్రాసినవన్నీ నా స్వంత భావాలే. అందరి గురించీ చెప్పటం లేదు. వారి భావాలు వేరుగా ఉండటం వల్ల కొంతమంది ఏకీభవించకపోవచ్చు. దానిలో తప్పులేదు. సైన్స్ గురించి నా ఆలోచనలు పంచుకోవటమే ఈ వ్యాసోద్దేశ్యం.

నేను అంత తెలివైనవాడిని కాదు కాబట్టి, బట్టీలు పట్టటంలో జీరోని కనుక, స్కూళ్ళలో చెప్పే పాఠాలు అర్థం చేసుకుని జీర్ణించుకోవటమే అలవాటయింది. ఆ అలవాటే నాకు ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ చదువులోనే కాక, రకరకాల ఉద్యోగాల్లోనూ, జీవితంలోనూ నేను అనుకున్నవి సాధించటానికి ఎంతో ఉపయోగపడుతున్నది.

న్యూటన్ మూడు సూత్రాలు బట్టీ పట్టలేక అవస్థపడుతుంటే, మా గురువుగారు నవ్వి 'ఒరేయ్, నువ్వు స్కూల్ మాగజైన్లో కథలు వ్రాయటం మొదలుపెట్టావు కదా, ప్రతి సూత్రానికీ చిన్న కథో, సుభాషితమో పెట్టుకో. అవి ఇక జీవితాంతం మరచిపోవు' అన్నారు. అనటమే కాదు ఒక ఉదాహరణ కూడా చెప్పారు. న్యూటన్ మొదటి సూత్రమే తీసుకో. 'A body at rest stays at rest, until an external force is applied'. అంటే ఏమిటి, 'ఎక్కడ వేసిన

గొంగళి అక్కడే ఉంటుంది, ఎవరైనా వచ్చి దాన్ని కదిలించేదాకా' అని. అదే న్యూటన్ మొదటి సూత్రం. అంతే, ఆయన చెప్పిన ఆ వేదవాక్కుతో బట్టీలు లేని నా చదువుల ప్రయాణం మొదలయింది.

థర్మొడైనమిక్స్ మొదలు హీట్ ట్రాన్స్ఫర్, హైడ్రాలిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, స్పేస్ టెక్నాలజీ... అన్నిటికీ ఇలాటి గుర్తులు పెట్టుకున్నాను. అవే నా వైజ్ఞానిక జీవితాన్ని నడిపిస్తున్నాయి. నాకు కూడూ, గూడూ, గుడ్డా ఇస్తున్నాయి. ఇలా ఎందుకుంటున్నానంటే, నేను ఉద్యోగరీత్యా మా సప్లయర్సుకీ, ఇతరులకీ ఇచ్చే ట్రైనింగ్ ప్రెసెన్టేషన్సులో కూడా ఇలాటి కథలు చెబుతుంటే వాళ్లకెంతో నచ్చేవి. మెచ్చుకుని నన్ను డెభై ఎనిమిదేళ్ళ వయసు దాకా ఉద్యోగంలో పెట్టుకుని పోషించారు. దీనితో నా సుదీర్ఘ స్వోత్కర్ష పూర్తయింది కనుక, అసలు విషయంలోకి వెడదాం.

ఈరోజుల్లో అక్కడ భారతదేశంలోనేకాక ఇక్కడ అమెరికాలో కూడా చాలమంది సైన్స్ అంటే తమకి ఇష్టం లేదనీ, దాని గురించి తెలుసుకోవటం సమయాన్ని వృధా చేసుకోవటమేననీ అంటుంటారు. ఇంకా కొంతమంది సైన్సంటే భయపడుతున్నామంటారు.

దీర్ఘంగా ఆలోచిస్తే ఇక్కడ మూడు రకాల వ్యక్తిత్వాలు కనిపిస్తాయి. ఒకటి నిజంగా భయపడేవారు. ఎవరికైనా గుప్పిట మూస్తే దాంట్లో ఏముందో తెలియదు. అది తెరిస్తే అంతా తేటతెల్లమవుతుంది. ఇక్కడ వీరిలో ప్రయత్నలోపం కనిపిస్తుంది. రెండవది వారి స్వప్రయోజనాల కోసం ఎన్నో అబద్ధాలు చెప్పి భయపెట్టి, అది ఇతరులకి తెలిస్తే వారి మనుగడకి ప్రమాదమని శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్మరించేలా చేయటం. మూడు మూఢనమ్మకాలతో ప్రజలని ఎంత అజ్ఞానంలో ఉంచితే వారికంత లాభం అని కొంతమంది కాకమ్మ కథలు చెప్పటం.

వీటికి ఉదాహరణలు చాల చెప్పవచ్చు. కొంచెం ఆగి నాకు తోచినవి కొన్ని చెబుతాను. ఈలోగా అసలు సైన్స్ మన మనుగడకి ఎంతవరకూ పని చేస్తుంది అన్నది చూద్దాం.

ప్రజాకవి పోతనగారు 'ఇందుగలడని అందులేడని సందేహంబు వలదు' అన్నట్టుగా సైన్స్ కూడా ఇక్కడా అక్కడా ఎక్కడా లేనిదే మనం ఉండము. మనకి మనుగడ ఉండదు. మన భూమి తన చుట్టూ తను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరగటం ఆపేస్తే మనం తొమ్మిది నిమిషాల్లో హుష్ కాకీ అయిపోతాం. ఎందుకంటే సూర్యరశ్మి సూర్యుడి దగ్గరనించీ భూమిని తాకటానికి తొమ్మిది నిమిషాలు పడుతుంది కనుక. మన ఉచ్ఛ్వాస నిశ్వాసలలో వదిలే కార్బన్ డయాక్సైడ్ని పత్రహరితంతో ఆక్సిజన్‌గా మార్చి ప్రాణం పోసే చెట్లు మనకది ఇవ్వకపోతే అదే మన ఆఖరి శ్వాస అవుతుంది.

అంతెందుకు మన శరీరమే ఒక సైన్స్ ఫాక్టరీ. ఇందులో భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, జీవ రసాయనశాస్త్రం, జన్యు శాస్త్రం, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ మొదలైనవన్నీ ఉన్నాయి. తెలుసుకోవాలనుకునే వారికి తెలుసుకున్నంత. నేను చెప్పేదేముంది.

అంతేకాదు మనం పంచభూతాలు అనేవి ప్రపంచంలోని సంస్కృతులన్నిటిలోనూ ఉన్నాయి. అవన్నీ ఎక్కడినించో ఊడిపడినవి కావు, మన చుట్టూ ఉన్నవే. మనం రోజూ చూసేవే. శాస్త్ర సంబంధమైనవే.

ఎంతో చల్లటి ఉష్ణోగ్రత ఉన్న చోట నీరు ఘనీభవిస్తే మంచు అవుతుంది. అదే మంచు కరిగితే నీరు అవుతుంది. కానీ కరగటానికి కావల్సిన వేడినిచ్చేది అగ్ని. ఆ అగ్ని ఎన్నో భౌతిక పదార్థాలను తగలబెట్టగలదు. ఆ అగ్నిని చల్లపరిచేది నీరు. వీటన్నిటినీ భరించి తను మాత్రం ఆగకుండా తన చక్రభ్రమణం చేసుకుంటూ ఉంటుంది భూమి. సూర్యుడు మన భూమికి ఇటుపక్క పగలు ఇచ్చి, అటు చీకటి ఇస్తాడు. పన్నెండు గంటల డ్యూటీ అవగానే అటు పగలు ఇచ్చి, ఇటుపక్క భూమితో దోబూచులాడతాడు. ఇది సైన్స్ ప్రకారం దాదాపు నాలుగు బిలియన్ సంవత్సరాలనించీ ఏ జీతమూ బత్తెమూ లేకుండానే చేస్తూనేవున్నాడు మన సూరిబాబు.

అంతేకాదు మన ఇంటా, బయటా ప్రతిరోజూ మనం బ్రతికేది ఆ సైన్సు వాడకంలోనే. మనం తినే తిండిలో వృక్షశాస్త్రం ఉంది. వండే వంటలో భౌతికశాస్త్రంతో పాటు, పాకశాస్త్రమూ ఉన్నది. ఇంట్లో వాడే ప్రతి వస్తువూ, టీవీ, రిఫ్రిజిరేటరూ, ఏసీ, మైక్రోవేవ్, సెల్‌ఫోన్ వంటి ప్రతిదీ, ఆఖరికి ఎలక్ట్రిసిటీ, గాస్, మంచినీరు, చివరికి నివాసముండే ఇల్లు, నడిపే కారు, ప్రయాణించే రైలుబండి, విమానం--- వీటన్నిటి వెనకాలా శాస్త్ర సంబంధమైన నిర్మాణమే ఉన్నది. సైన్స్ లేని మానవ జీవితం లేనేలేదనిపిస్తుంది.

ఇందాక మనలో కొంతమంది సైన్సుని ఈరోజుల్లో మూడు కారణాల వల్ల నమ్మటం లేదని అనుకున్నాం. అవేమిటో చూద్దాం.

మొదటిది ప్రయత్నలోపం అనుకున్నాం. దీనికి కారణాలు పైన నేను చెప్పిన వాటిని చదివినప్పుడు మీ ఆలోచనలలోకి వచ్చే ఉంటాయి. అయినా క్లుప్తంగా చూద్దాం. చదువులని అమ్మకానికి పెట్టాక విజ్ఞానంకన్నా బట్టీలు పట్టి చదువు'కొని' డిగ్రీ సంపాదనే ముఖ్యం అయింది. గురువులు టీచర్లుగా మారి ప్రైవేట్లు చెప్పుకొని ధన సంపాదనకే విలువివ్వటం చేస్తున్నారు. అదీకాక గొర్రె మనస్థత్వంతో ఎక్కడ ఎక్కువ ఉద్యోగాలుంటాయో వాటిలో డిగ్రీ తెచ్చుకుని ఉద్యోగంలో చేరటమే కానీ, ఇష్టపడి చదివే సైన్సు సంబంధమైన చదువులు బాగా వెనకబడ్డాయి. కనీసం మంచి సైన్స్ పుస్తకాలు చదివితే ఆ విజ్ఞానం వస్తుంది కదా అంటే, పుస్తక పఠనం ఏనాడో అటకెక్కింది. ఎంతోమందికి మన బూతు సినిమాల, ఆటల మీద ఉన్న ధ్యాస, ఆసక్తి సైన్స్ మీద లేదు.

రెండవది వారి స్వప్రయోజనాల కోసం, ఎన్నో అబద్ధాలు చెప్పి భయపెట్టి, అది ఇతరులకి తెలిస్తే వారి మనుగడకి ప్రమాదమని శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్మరించేలా చేయటం అని పైన చెప్పాను. దానికి పెద్ద ఉదాహరణ ఈ రోజుల్లో అమెరికా రాజకీయరంగంలో ఇప్పుడు చూస్తున్నదే. ఇప్పుడు పదవిలో ఉన్న ఒక రాజకీయ పార్టీకి సైన్స్ మీద అసలు నమ్మకమే లేదని వారే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇక్కడి ఆరోగ్యశాఖ రాజు'గాడు' టీకాలు అనేది నమ్మకూడదని రోజుకి మూడుసార్లు, తన రోగాలకి శాస్త్రజ్ఞులు కనిపెట్టిన మాత్రలు వేసుకునే సమయంలో చెబుతూనే ఉన్నాడు. ఆనాటి పోలియో నుండి ఈనాటి కోవిడ్ దాకా టీకాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్ని కోట్ల ప్రాణాలు కాపాడిందో మరచిపోయాడు. దానికి దేశ అధ్యక్షుడు కూడా పూర్తి మద్దతు ఇస్తున్నాడు. క్లోరాక్స్ వంటి బ్లీచింగ్ ద్రావకాలు త్రాగమంటాడు. తను మాత్రం

అవి త్రాగడు. అంతేకాదు వాళ్ళందరూ మనకన్నా ముందే కోవిడ్ టీకాలు కూడా వేయించుకున్నారు. ఎందుకంటే వారికి వారి ఆరోగ్యం మాత్రమే ముఖ్యం కనుక. వారిద్దరూ ఆ పార్టీ పెద్దలతో కలిసి, కమ్యూనికేటివ్ డిసీజస్ రీసెర్చిలో ఎంతో పేరుగాంచిన గొప్ప శాస్త్రజ్ఞుడిని ఉద్యోగంలోనించీ తీసేసి, తన అబద్ధాలతో ప్రజలు ఆరోగ్యం చెడగొడుతున్నాడని అబద్ధాలు చెప్పి నేరస్థుడిగా నిలబెట్టి జైలుపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారు అన్న ప్రశ్న మీకే కాదు నాకూ వచ్చింది. దీనికి జవాబు ఈ పేరా మొదట్లోనే చెప్పాను. మరొక్కసారి చదవండి. అంతేకాదు కొంచెం ఆలోచిస్తే మీకే ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరమైన సారా, గుడంబా ప్రతి చోటా ఎన్నో వేల ప్రసాదులు (ప్రభుత్వ సారా దుకాణాలు) ప్రభుత్వమే పెట్టి జనాలకి రోజూ పీపాలకి పీపాలు నోట్లో పోస్తున్నది. హింసాత్మక సెక్స్ సినిమాల్లో త్రాగటం ఆరోగ్యానికి ప్రమాదకరం అని వ్రాసి చేతులు కడుక్కుంటే సరిపోతుందా? ఓటర్లకైతే ఒక పీపా తాగేవాడికి ఎన్నికల సమయంలో ఉచితంగా రెండు పీపాలిస్తున్నారు. వారి సంసారాలు నాశనం చేస్తున్నారు. ఇవన్నీ సైన్సుకి విరుద్ధమే అయినా వారి స్వార్థం, లాభాపేక్ష వారివి.

ఇక మూడవది మూఢనమ్మకాలతో ప్రజలని ఎంత అజ్ఞానంలో ఉంచితే వారికంత లాభం అని. ఎక్కడో కొన్ని మిలియన్ల, ట్రిలియన్ల కాంతిసంవత్సరాల దూరంలో ఉన్న గ్రహాలు మీ జీవితంలో ఈ గదిలో కాక ఆ గదిలో ఉన్నాయనీ, అందువల్ల మీకు త్వరలో మరణం సంభవిస్తుందనీ భయపెట్టి, దానికి విరుగుడుగా ఏదో పూజ చేసి ప్రజలని 'రక్షించే'వారిని ఏమనాలి? వాస్తుశాస్త్రం శాస్త్రమనే ముసుగు వేసుకున్న మూఢనమ్మకం. ఇంటి ప్రధాన ద్వారం తూర్పు, ఉత్తరం లేదా ఈశాన్య దిశల వేపున ఉండాలి అంటున్నారు. మరి వాటికి ఎదురుగా ఉన్న ఇళ్ళల్లో ఉండే ఇళ్ళు ఖాళీగా కనపడవెందుకో మరి! అక్కడ ఉండే వాళ్ళందరూ అందరిలాగానే, సుఖంగానే ఆరోగ్యంగానే ఉంటున్నారు కదా!

అలాగే ఇటు నక్షత్రం, అటు గ్రహం కాని ఉపగ్రహం చంద్రుడు, సూర్యుడు అనే నక్షత్రంతో దోబూచులు ఆడుతున్నప్పుడు వచ్చే సూర్య, చంద్ర గ్రహణాలకు, రాహువూ కేతువూ అనే పాత్రలతో కథలు చెప్పి మాయ చేయటంలాటివి ఎన్నెన్నో ఉన్నాయి. చంద్రుడి మీద వ్యోమగాములు నడిచారనే ఎంతో చారిత్రాత్మక విషయాన్ని ఒక కట్టు కథనీ, దాన్ని నమ్మవద్దనీ అమెరికాలోనే కొన్ని 'గుంపులు' ప్రచారం చేశారు. ఇలా మూఢనమ్మకాలతో సైన్సుని దాచిపెడితే వాళ్ళకి వచ్చిన లాభమేమిటి అన్నదానికి సమాధానం మీరే చెప్పాలి.

దాని బదులు అర్థమయే పదాలతో శాస్త్రప్రకారంగా అలాటివి ఎందుకు జరుగుతాయో చెప్పవచ్చు కదా! ఆ మూఢనమ్మకాలని వమ్ముజేసి వారి జ్ఞాన సముపార్జనకు సహాయపడవచ్చు కదా! పడరు. ఎందుకంటే ఆ పేరు చెప్పుకుని బ్రతికేవారికి 'ధన లాభం' మాయమైపోతుంది కదా!

ఇది విశాలమైన విశ్వం (Vast Universe). దీనిలో రెండు ట్రిలియన్ల నక్షత్ర మండలాలు (గెలాక్సీలు) ఉన్నాయి. వాటిలో మన భూగ్రహం ఉన్న నక్షత్ర మండలం పేరు పాలపుంత (మిల్కీ వే). మన పాలపుంతనే గెలాక్సీలో నక్షత్రాలూ, గ్రహాలూ కలిపి నాలుగు వందల మిలియన్ల నించీ మూడు ట్రిలియన్ల దాకా ఉన్నాయని అంచనా. మన

సూరిబాబుగారి సౌరకుటుంబంలో పెద్దా చిన్నా కలిపి మొత్తం పదమూడు గ్రహాలున్నాయి. వాటిలో మన భూగ్రహం ఒకటి. మన గ్రహం మీదున్న 8 బిలియన్ల మనుష్యుల్లో మీరొకరు, నేనొకడిని. అంటే ఈ విశాలవిశ్వంలో మనం పరమాణువుల్లోని పరమాణువు కన్నా ఒక చిన్న నలకలాటి బుల్లి వాళ్ళమన్నమాట. అయినా మనమే ఈ విశ్వాన్ని సృష్టించామనే వాళ్ళూ ఉన్నారు. అదెలా కాదో క్రింద చెబుతాను చూడండి.

ఇంత విస్తారమైన విశ్వం వయసు దాదాపు 13.8 బిలియన్ సంవత్సరాలు. మన నక్షత్ర మండలం పాలపుంత వయసు దాదాపు 13.6 బిలియన్ సంవత్సరాలు. భూమి వయసు 4.58 బిలియన్ సంవత్సరాలు. ముందు అంతా ఎన్నో రసాయన పవనాలతో మాత్రమే ఉన్న మన భూమితో, 3.8 బిలియన్ సంవత్సరాలక్రితం ఇంకొక భారీ నీళ్లతో ఉన్న గ్రహం గుద్దుకుని మన భూమి స్వరూపం మారిపోవటం మొదలయింది. రకరకాల వృక్ష(జీవ)కోటి, జంతు(జీవ)కోటి వచ్చాయి. జంతువుల్లో కూడా చింపాంజీలు రావటానికి కొన్ని మిలియన్ల సంవత్సరాలు పట్టింది.

దరిమిలా చిపాంజీలలోనించీ డ్రైమోపితికస్ (12–15 మిలియన్ సంవత్సరాల క్రితం), రమాపితికస్ (8–12 మిలియన్ సంవత్సరాల క్రితం), ఆస్ట్రాలోపితికస్ (3–4 మిలియన్ సంవత్సరాల క్రితం), హోమోహబిలిస్ (2 మిలియన్ సంవత్సరాల క్రితం), హోమోఎరక్టస్ (1.9 మిలియన్ సంవత్సరాల క్రితం), నియాండర్తాల్ (400–40,000 సంవత్సరాల క్రితం), తర్వాత హోమో సెపియన్సులా (300,000 సంవత్సరాల క్రితం) రూపాంతరం చెందారు. అంటే మనుష్యులవంటి చిపాంజీలకు నాలుగు కాళ్ళ మీద నించీ, రెండు కాళ్ళ మీద వంగి నడవటం, శరీరం మీద జుట్టు రాలిపోవటం, మెదడు సైజ్ మారటం, ముఖకవళికలు, రంగులు మారటం జరిగాయి. మనలాగా రెండు కాళ్ళ మీద నడిచే మనుష్యులుగా తయారయి, ఈ భూమ్మీద రెండు కాళ్ళు నిఠారుగా పెట్టి నడిచారు. నలభై వేల సంవత్సరాల క్రితం ఈనాటి మనుష్యుల్లాగా తెలివితేటలతో ఆలోచించటం, తమ రక్షణ కోసం. భక్షణ కోసం పరికరాలు తయారుచేసుకోవటం మొదలుపెట్టారు. అంటే 13.8 బిలియన్ సంవత్సరాల ఈ భూమ్మీద మనం పసిపాపల కన్నా ఇంకా పసిపాపల కన్నా బాగా పసివాళ్ళమన్నమాట!

ఆ ఆలోచనా విధానాల ఆధారంగా, ఇంకా తెలివితేటలు పెంచుకుని, పంచుకుని ఈనాటి మనుష్యులుగా రూపాంతరం చెందారు. వారిలో రకరకాలు వృత్తులతో పాటు, శాస్త్రజ్ఞులు కూడా వచ్చారు.

నిరంతర శాస్త్ర ప్రయోగాలు, ఎంతో శక్తివంతమైన టెలిస్కోపుల ద్వారా, మన ఉపగ్రహాల ద్వారా, అంతరిక్ష నౌకల ద్వారా నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఇంకా ఎన్నో కొత్త విషయాలు బయటికి వస్తూనే ఉన్నాయి.

మన అంతరిక్షంలోనే కాదు, కాలి క్రిందనే ఉన్న భూమిలోని విశాల ప్రపంచాన్ని, మనతోపాటూ భూమిని ఆక్రమించిన 71% నీటి క్రింద ఉన్న ఇంకొక పెద్ద ప్రపంచాన్ని కూడా పరిశోధించి, పరిశోధిస్తూ పురోగమిస్తున్నది మన సైన్స్. విజ్ఞానశాస్త్రం.

నేను పంథొమ్మిది వందల డెభైలలో తిరువనంతపురంలో ఇస్రో విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రంలో పని చేస్తున్నప్పుడు, ఒక ఇంగ్లీష్ పత్రికలో "Residue of Science" అనే వ్యాసం వ్రాశాను. అది ఎంతోమందిని ఆకర్షించింది. దాని మీద ఎన్నో చర్చలూ జరిగాయి. అమెరికాకి వచ్చాక నేను వ్రాసిన "సత్యమేవజయతే" అనే వ్యాస పరంపర ధారావాహికలో, ఆ వ్యాసానికి కొంత కొత్త సమాచారాన్ని కూడా కలిపి "శాస్త్ర శేషం" అనే పేరుతో ఒక వ్యాసం తెలుగులో వ్రాశాను. అది కూడా ఎంతోమంది పాఠకులకు నచ్చిన వ్యాసం. పాఠకుల స్పందన నేను ఆ పుస్తకం వెనుక అట్ట మీద ప్రచురించాను కూడాను. ఇంతకీ ఇక్కడ చెప్పబోయేదేమిటంటే, సైన్సుకి కూడా ఎన్నో తెలిసినా అన్నిటిలాగానే ఇంకా తెలుసుకోవలసినవి చాల ఉన్నాయి. సైన్స్ ద్వారా విశాల విశ్వం గురించి తెలుసుకున్నాం. మన శరీర నిర్మాణం గురించి ఎంతో తెలుసుకున్నాం. ఎన్నో కొత్త కొత్త మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలను కనిపెట్టి వాడుతున్నాం. ఒకనాడు పక్షులు మాత్రమే ఎగిరిన ఆకాశంలో విమానాల్లో ఇప్పుడు మనం ఖండాలు దాటి ఎగురుతున్నాం. అయినా, పింగళి మహాశయులు ఒక పాటలో చెప్పినట్టు, 'అయినా మనిషి మారలేదు, ఆతని ఆశ తీరలేదు'. ఇంకా రెట్టించిన ఉత్సాహంతో నిరంతరం ఎంతో శ్రమపడి, ఎన్నో రంగాలలో ఇంకా శాస్త్ర విజ్ఞాన పరిశోధన చేస్తూనే ఉన్నాము. చేస్తూనే ఉంటాము. ఇవాళ శాస్త్ర శేషానికి సమాధానాలు కనుక్కుని, రేపు వాటి గుప్పిట విప్పి అదేమిటో చూపిస్తారు శాస్త్రజ్ఞులు. అయినా ఇంకా ఎంతో శాస్త్ర శేషం ఉంటూనే ఉంటుంది. శాస్త్ర రహస్యాలు వెలికి తీస్తూనే ఉంటారు. మరి శాస్త్రం అంటే ఏదో ఊహాలోకంలో విహరించేది కాదు, అది ఎన్నో ప్రయోగాలతో, నిరూపణలతో శోధించి సాధించి, కొత్త విషయాలని కనుక్కుని మన మనుగడకి ఉపయోగపడాలి కదా! ఎంత శ్రమపడి, ఎన్ని తలకాయలు వాడితే అలా చేయగలం!

అందుకే ప్రపంచంలోని అందరు శాస్త్రజ్ఞులకూ వందనాలు. ధన్యవాదాలు.

విజ్ఞానశాస్త్రం ఎప్పుడూ శాస్త్రీయమే! ఏమంటారు?

o o o

(నాకు ఏది ఎప్పుడు వ్రాసినా, మాట్లాడినా తెలుగువి తెలుగులోనే, ఇంగ్లీషువి ఇంగ్లీషులోనే చెప్పటం అలవాటు. ఇలాటి వ్యాసాలలో అలా రాయటం కుదరదు కాబట్టి కొన్ని చోట్ల ఆంగ్ల పదాలు వాడవలసి వచ్చింది. మన్నించాలి)

(మరో ముచ్చట వచ్చే నెలలో)

COMMENTS